సిరియాపై ఇజ్రాయెల్ | వైమానిక దాడులు

దాడులపై స్పందించని హెచ్‌టీఎస్.. సిరియా ఆపద్ధర్మ ప్రధానిగా బషీర్

డమాస్కస్, డిసెంబర్ 10: తీవ్ర సంక్షోభం నెలకొని ఉన్న సిరియాపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఆకస్మికంగా దాడులకు దిగాయి. ఆ దేశ రాజధాని డమాస్కస్‌లో 25 కిలోమీటర్ల వరకు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చొచ్చుకు వచ్చాయని సిరియన్ ప్రతిపక్ష వార్ మానిటర్ మంగళవారం తెలిపింది. అయితే ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ఖండించింది. అసోసియేట్ ప్రెస్ తెలిపిన వివరాల ప్రకారం సిరియా నగరం, సబర్బన్ ప్రాంతాల్లో భారీ యెత్తున వైమానిక దాడులు జరిగాయి. సిరియా గగనతలంలో మిస్సైల్ లాంచర్లు, హెలికాప్టర్లు చక్కర్లు కొడుతున్న దృశ్యాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడులపై తిరుగుబాటుకు నేతృత్వం వహించి సిరియాను ఆక్రమించుకున్న హయత్ తాహిర్ అల్ షామ్ (హెచ్‌టీఎస్) ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే సిరియాలోని సుమారు 400 కిలోమీటర్ల పరిధిలోని బఫర్‌జోన్ గోలన్ హైట్స్‌ను ఇజ్రాయెల్ దళాలు ఆదివారం స్వాధీనం చేసుకున్నాయి. సిరియా అతివాదుల పాలనలోకి వెళ్లనున్నందున ముందు జాగ్రత్త చర్యగా ఆ దేశంలోని రసాయన ఆయుధగారాలు, భారీ ఆయుధ స్థావరాలపై దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ తెలిపింది.

ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ధ్వంసమైన సిరియాలోని ఓ నౌకా స్థావరం

రెబల్స్ తాత్కాలిక ప్రభుత్వం

అధికారాన్ని కైవసం చేసుకున్న సిరియన్ తిరుగుబాటుదారులు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆపద్ధర్మ ప్రధాన మంత్రిగా మహమ్మద్ అల్ బషీర్ పేరును ఖరారు చేశారు. ఈ తాత్కాలిక ప్రభుత్వం మార్చి 1 వరకు అధికారంలో ఉంటుందని దేశ అధికారిక టెలివిజన్ టెలిగ్రామ్ అకౌంట్‌లో ప్రకటించారు. ఇంతకుముందు వాయువ్య సిరియా, ఐడ్లిబ్‌లోని కొన్ని ప్రాంతాలను పాలించిన హయత్ తహ్రిర్ అల్ షామ్(హెచ్‌టీఎస్) ప్రభుత్వాధినేతగా వ్యవహరించారు.

'మానవ వధశాల'లో దారుణ పరిస్థితులు

అసద్ పాలన నుంచి విముక్తి లభించడంతో సంబరాలు చేసుకుంటున్న సిరియా ప్రజలు.. సైద్నాయ జైలులోని దారుణ పరిస్థితులు చూసి చలించిపోయారు. అసద్ పాలనను వ్యతిరేకించేవారిని 'మానవ వధశాల'గా పిలిచే ఈ జైలులో బంధించే వారు. కనీసం కిటికీలు కూడా లేని చిన్న చిన్న గదుల్లో పదుల సంఖ్యలో ఖైదీలను పెట్టి హింసించేవారు. అసద్‌ను వ్యతిరేకించిన వేలాది మంది సిరియన్లు కనిపించకుండా పోయారు. వీరిని వెతుక్కుంటూ బంధువులు సైద్నాయ జైలులోకి చొచ్చుకెళ్లారు. తిరుగుబాటుదారులు అడ్డుకున్నా లెక్కచేయకుండా వెళ్లి బందీలుగా ఉన్న వారిని విడిపించారు. అనేక ఏండ్ల తర్వాత తమ ఆత్మీయులను చూసుకొని కన్నీరు పెట్టుకున్నారు. ఈ జైలులో భూగర్భంలో ఐదు అంతస్థులు ఉన్న అండర్‌గ్రౌండ్ జైలు కూడా ఉంది. అసద్ వ్యతిరేకులను ఇక్కడికి తీసుకొచ్చి విద్యుత్తు షాక్ ఇవ్వడంతో పాటు దారుణంగా హింసించే వారని చెప్తున్నారు. ఈ జైలులో 2011 నుంచి 2016 మధ్య 13 వేల మంది సిరియన్లను ప్రభుత్వ బలగాలు రహస్యంగా హతమార్చాయని మానవ హక్కుల సంస్థలు చెప్తున్నాయి.

జడ్జి విద్వేష పూరిత ప్రసంగం?

అలహాబాద్ హైకోర్టును నివేదిక కోరిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ/లక్నో, డిసెంబర్ 10: విశ్వ హిందూ పరిషత్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో న్యాయ నైతికతను ఉల్లంఘించి జడ్జి శేఖర్ కుమార్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ వచ్చిన ఆరోపణలపై నివేదిక పంపాలని అలహాబాద్ హైకోర్టుకు సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. విద్వేషపూరిత ప్రసంగం చేసిన జడ్జిపై అభిశంసన తీర్మానం పెట్టాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. డిసెంబర్ 8న వీహెచ్‌పీ యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో జడ్జి శేఖర్ కుమార్ మాట్లాడారు. సామాజిక సామరస్యం, లౌకిక వాదం, లింగ సమానతను ప్రోత్సహించడమే యూనిఫామ్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి) ప్రధాన ధ్యేయమని అన్నారు. అయితే ఒక రోజు అనంతరం రెచ్చగొట్టే అంశాలపై జడ్జి చేసిన ప్రసంగాలు వైరల్ కావడంతో విపక్షాలు సహా పలు వర్గాల నుంచి వ్యతిరేకత రావడమే కాక విద్వేషపూరిత ప్రసంగం చేసిన జడ్జిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

మాధవ్ గాడ్గిల్‌కు 'చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్'

ఐరాస అత్యున్నత పర్యావరణ పురస్కారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ఐక్యరాజ్యసమితి (ఐరాస) అత్యున్నత పర్యావరణ పురస్కారం 'చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్'కు భారత్‌కు చెందిన ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త మాధవ్ గాడ్గిల్ (82) ఎంపికయ్యారు. 2024 ఏడాదికి సంబంధించి అవార్డ్ గ్రహీతల జాబితాను ఐరాస మంగళవారం విడుదల చేసింది. ప్రపంచంలోనే అత్యంత జీవ వైవిధ్యాన్ని కలిగిన పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ పురస్కారానికి ఐరాస ఎంపికచేసింది. ఈ ఏడాది అవార్డు గ్రహీతల్లో భారత్ నుంచి మాధవ్ గాడ్గిల్ ఒక్కరికే చోటు దక్కింది. గతంలో కేంద్రం ఏర్పాటుచేసిన ప్యానెల్‌కు మాధవ్ గాడ్గిల్ నేతృత్వం వహించారు. పురస్కారానికి ఎంపిక కావటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వారానికి 4 రోజులే పని!

జపాన్ ప్రభుత్వం కొత్త విధానం

పిల్లల్ని కనేందుకు ఆఫర్లు

టోక్యో: దేశంలో జననాల రేటును పెంచేందుకు జపాన్ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతున్నది. వారానికి నాలుగు రోజుల పని దినాలను అమలు చేయాలని నిర్ణయించింది. దీని వల్ల క్షీణిస్తున్న సంతానోత్పత్తి సమస్యను ఎదుర్కోవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. జపాన్‌ను ప్రస్తుతం వృద్ధ జనాభా సంఖ్య ఆందోళనకు గురిచేస్తున్నది. దేశ జనాభా మొత్తంగా తగ్గుతున్నప్పటికీ 65 ఏండ్లు పైబడిన వృద్ధులు దేశంలో 29.3%మంది ఉండడం ప్రభుత్వాన్ని ఆందోళనపరుస్తున్నది. కొత్త విధానం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు వారానికి 3 రోజులు కుటుంబంతో గడపవచ్చు. టోక్యో మహిళా గవర్నర్ యురికో కొయికే ఈ ఆలోచనను అమలు చేయనున్నారు.

'విల్లో' తో కంప్యూటింగ్ విప్లవం

- గూగుల్ క్వాంటమ్ చిప్ ఆవిష్కరణ
- సూపర్ కంప్యూటర్ల బలాదూర్

న్యూయార్క్, డిసెంబర్ 10: క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో గూగుల్ సరికొత్త విప్లవాన్ని సృష్టించింది. 'విల్లో' పేరుతో కొత్త క్వాంటమ్ చిప్‌ను ఆవిష్కరించింది. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న వేగవంతమైన సూపర్ కంప్యూటర్ల కంటే ఇది గణనీయమైన వేగంతో పని చేస్తుందని గూగుల్ పేర్కొన్నది. కంప్యూటింగ్‌లో ఎర్రర్‌లను తగ్గించడంతో పాటు వేగాన్ని భారీగా పెంచడం 'విల్లో' ప్రత్యేకత అని ప్రకటించింది. కంప్యూటర్ల వేగాన్ని పరీక్షించేందుకు ప్రమాణంగా పేర్కొనే రాండమ్ సర్క్యూట్ సాంప్లింగ్(ఆర్‌సీఎస్) లెక్కను ఇది కేవలం ఐదు నిమిషాల లోపే పూర్తి చేసింది. ఇదే లెక్క ప్రపంచంలోనే వేగవంతమైన సూపర్ కంప్యూటర్ చేయడానికి 10 సెప్టిల్లియన్ సంవత్సరాలు పడుతుంది. సెప్టిల్లియన్ సంవత్సరాలు అంటే మన విశ్వం వయసు కంటే ఎక్కువ. సంక్లిష్టమైన గణిత సమస్యలను సంప్రదాయ కంప్యూటర్ వ్యవస్థల కన్నా వేగంగా క్వాంటమ్ ప్రాసెసర్లు పరిష్కరించగలవని విల్లో నిరూపించిందని గూగుల్ పేర్కొన్నది. అమెరికాలోని శాంటా బర్బరలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో విల్లోను గూగుల్ అభివృద్ధి చేసింది. సంప్రదాయ కంప్యూటర్ల ద్వారా చేయలేని అల్గారిథంలను నిర్వహించడంలో విల్లో కీలక అడుగు అని ఈ సందర్భంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. సాంకేతిక పురోగతి, సామాజిక ప్రయోజనంలో కొత్త యుగానికి విల్లో మనల్ని మరింత చేరువ చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన చేసిన పోస్ట్‌కు టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ స్పందిస్తూ..'అద్భుతం' అని బదులిచ్చారు.

భూమికి సత్తువనిచ్చే ప్లాస్టిక్!

- పర్యావరణ కాలుష్యానికి చెక్
- జపాన్ పరిశోధకుల ఆవిష్కరణ

టోక్యో: పర్యావరణ హితకరమైన ప్లాస్టిక్ తయారీలో జపాన్ శాస్త్రవేత్తలు విప్లవం సృష్టించారు. సముద్రపు నీటిలో కలిసి, కొద్ది గంటల్లోనే ఈ ప్లాస్టిక్ కరిగిపోతుంది. దీనిని ఆర్ ఐకేఈఎన్ సెంటర్ ఫర్ ఎమర్జెంట్ మ్యాటర్ సైన్స్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ ప్లాస్టిక్‌ను ప్యాకేజింగ్ నుంచి మెడికల్ డివైసెస్ వరకు అన్ని రకాల వస్తువుల తయారీకి ఉపయోగించవచ్చు. వేర్వేరు పరిశ్రమల్లో వాడటానికి సురక్షితమైన, విషరహిత పదార్థాలతో దీనిని తయారు చేశారు. సాధారణ ప్లాస్టిక్స్ ఈ విధంగా కరగాలంటే వందల సంవత్సరాలు పడుతుంది. జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ప్లాస్టిక్ సముద్ర జలాల్లో కొద్ది గంటల్లోనే కరిగిపోతుంది. భూమిలో కలిస్తే 10 రోజుల్లో క్షీణిస్తుంది.

లింగాయత్‌ల కోటా పోరు హింసాత్మకం

కర్ణాటకలో నిరసనకారులపై పోలీసుల లాఠీచార్జి

బెంగళూరు: కర్ణాటకలో తమకు రిజర్వేషన్ కోటాను పెంచాలని కోరుతూ లింగాయత్ పంచమశాలి శాఖ మఠాధిపతి బసవజయ మృత్యుంజయ స్వామీజీ సారథ్యంలో నిరసనకారులు చేపట్టిన ఆందోళన మంగళవారం బెళగావిలో హింసాత్మకంగా మారింది. శీతాకాల సమావేశాలు జరుగుతున్న అసెంబ్లీని ముట్టడించేందుకు నిరసనకారులు ప్రయత్నించగా వారిని చెదరగొట్టేందుకు పోలీసలు లాఠీచార్జి చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చని పక్షంలో అసెంబ్లీని దిగ్బంధిస్తామని హెచ్చరిస్తూ ఆందోళనకారులు విధాన్ సౌధకు బయల్దేరడంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు బలప్రయోగం చేశారు. బీజేపీ నాయకులతోపాటు స్వామీజీని పోలీసులు ముందస్తు కస్టడీలోకి తీసుకున్నారు. ప్రభుత్వ వాహనాలతోపాటు ఎమ్మెల్యేలకు చెందిన వాహనాలను సైతం నిరసనకారులు ధ్వంసం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేసిన పంచమశాలి శాఖకు ప్రస్తుతం ప్రభుత్వ విద్యా సంస్థలు, ఉద్యోగాలలో 5 శాతం రిజర్వేషన్ ఉంది. దీన్ని 15 శాతానికి పెంచాలని వారు ఆందోళన చేపట్టారు.

ఈవీఎంలు వద్దు!

మహారాష్ట్రలో మరో గ్రామం తీర్మానం

పుణె: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై దేశ వ్యాప్తంగా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలో తమకు ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపరే కావాలంటూ మరో గ్రామం డిమాండ్ చేసింది. ఇక ముందు గ్రామంలో జరిగే ఏ ఎన్నిక అయినా బ్యాలెట్ పేపర్ ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్ర సతారా జిల్లాలోని కొలేవాడి గ్రామ సభ తీర్మానించింది. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు డిసెంబర్ 2న ఈ తీర్మానం చేసినట్టు సర్పంచ్ భర్త మంగళవారం తెలిపారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై సుప్రీంకు ఇండియా కూటమి

న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో అనూహ్య పరాజయం పొందిన ఇండియా కూటమి.. ఈవీఎంల రిగ్గింగే తమ ఓటమికి ప్రధాన కారణమని భావిస్తున్నది. ఈవీఎంల్లో అనేక అవతవకలు జరిగినట్టు కూటమి ఆరోపించింది. అయితే దీనిని ఈసీ తిరస్కరించింది. దానితో సంతృప్తి చెందని కూటమి నేతలు ఈవీఎంల అవకతవకలపై సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నారు. శుక్రవారం లోగా దీనిపై పిటిషన్‌ను వేస్తారని కూటమి నేతలు తెలిపారు.

భార్య వేధింపులపై 24 పేజీల సూసైడ్ నోట్

బెంగళూరులో యూపీ టెకీ ఆత్మహత్య

బెంగళూరు, డిసెంబర్ 10: భార్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక ఉత్తరప్రదేశ్‌కు చెందిన 34 ఏండ్ల టెకీ బెంగళూరులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి 24 పేజీల సుదీర్ఘమైన సూసైడ్ నోట్‌ను, 1.5 గంటల వీడియోను అతడు రికార్డ్ చేశాడు. తన భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారని అతడు వెళ్లగక్కిన ఆవేదన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు అతుల్ సుభాశ్ సోమవారం తన నివాసంలో ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ తీవ్రమైన నిర్ణయం తీసుకోవడానికి ముందు అతడు తన సూసైడ్ నోట్, వీడియోను పలువురికి ఈ-మెయిల్ చేశాడు. తాను సభ్యుడిగా ఉండే ఎన్జీవో వాట్సప్ గ్రూప్‌లోనూ షేర్ చేశాడు. 'న్యాయం బకాయి ఉంది' అన్న ప్లకార్డును తన ఇంట్లో వేలాడదీశాడు. సూసైడ్ నోట్‌లో తన భార్యతో కొనసాగుతున్న వైవాహిక బంధ వివాదం గురించి పేర్కొన్నాడు. భరణం కోసం తమ నాలుగేండ్ల కొడుకును తన భార్య తనపైకి అస్త్రంగా ప్రయోగించిందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ కుటుంబ న్యాయ స్థానంలో తనపై తన భార్య కుటుంబం పెట్టిన కేసుల్లో హత్య, అసహజ శృంగారం, భరణం కోసం నెలకు రూ.2 లక్షల డిమాండ్ ప్రధానమైనవని వెల్లడించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, టెకీ ఆత్మహత్య నేపథ్యంలో 'మెన్‌టూ' అన్నది ఎక్స్‌లో ట్రెండింగ్‌గా మారింది. చట్టాలన్నీ మహిళలకు అనుకూలంగానే ఉన్నాయని నెటిజన్లు పోస్టులు పెట్టారు.

ఉద్యోగుల సమస్యలు త్వరగా పరిష్కరించండి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 10 : ఉద్యోగుల సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన అధ్యక్షతన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులతో స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను ఏఐటీయూసీ నాయకులు ప్రస్తావించారు. వెంటనే పరిష్కారం చూపాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కవీంద్ర, ఏజీఎం జ్యోతి, ఓసీ- 2 ప్రాజెక్టు అధికారి వెంకటరాంరెడ్డి, ఏజీఎం రామకృష్ణారెడ్డి, ఏసీఎంవో పద్మజ, డీజీఎం సివిల్ రవికుమార్, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమే పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

మంగపేట, డిసెంబర్10 : మండలంలోని రాజుపేట గ్రామ పొలిమేర ప్రధాన రహదారిపై మంగళవారం సాయంత్రం బైక్ అదుపు తప్పిన సంఘటనలో వేముల జోష్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు ప్రాంతానికి చెందిన జోష్‌కుమార్ రాజుపేట మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వైపునకు బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా, స్థానికుల సహకారంతో 108 వాహనంలో ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించి, చికిత్స అందిస్తున్నారు.

పెండింగ్ డీఏలను ప్రభుత్వం విడుదల చేయాలి

గోవిందరావుపేట, డిసెంబర్ 10 : పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేస్తూ 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వాసుదేవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పస్రా హైస్కూల్‌లో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ మండలశాఖ మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ములుగు ఎస్టీవోలో 2024 డీఎస్సీ నూతన ఉపాధ్యాయుల నుంచి సాలరీ బిల్ చేసేందుకు కొందరు మధ్యవర్తులు డబ్బులు అడుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయంపై ఎస్టీవోను కలిసి మాట్లాడనున్నట్లు చెప్పారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా జ్యోతి, రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రామ్‌కుమార్, కోశాధికారిగా మల్లారెడ్డి, కార్యదర్శులుగా తేజ, సరిత, ప్రవళిక, మల్లికార్జున్, సంతోశ్, జిల్లా కౌన్సిలర్‌గా ఝాన్సీ రాణి, రమేశ్, శ్యాంసుందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా కొర్ర రఘురామ్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వెంకటయ్య, మీడియా ఇన్‌చార్జిగా సదర్‌లాల్, కల్చరర్ ఇన్‌చార్జిగా దీప్‌లాల్, సోషల్ మీడియాకు రవీందర్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు.

భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలి

కాటారం, డిసెంబర్ 10 : మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీరు అందేలా చూడాలని మండలంలోని సుబ్బయ్యపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. పోతుల్వాయి గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమై 15 రోజులుగా నీరు రావడం లేదన్నారు. బ్రిడ్జి నిర్మాణం పనులు చేస్తున్న వారికి ఎన్ని సార్లు చెప్పినా స్పందించడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి పైపులైన్ పనులు చేయించి సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని గ్రామస్తులు వెంకటస్వామి, నరేష్, బుచ్చయ్య, మధు, సత్యం, రాజేశ్ డిమాండ్ చేశారు.

అంబేద్కర్ నేషనల్ అవార్డుకు కేటీపీపీ ఆర్టిజన్ కార్మికుల ఎంపిక

గణపురం, డిసెంబర్ 10 : మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన కేటీపీపీలో ఆర్టిజన్ కార్మికులుగా పనిచేస్తున్న ఇనుగాల కుమార్, బొమ్మ కంటి రాజేందర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఎంపిక పత్రాన్ని అందుకున్నారు. ఈ నెల 15న న్యూఢిల్లీలో జరిగే బహుజన సాహిత్య కార్యక్రమంలో వారు అవార్డులు అందుకోనున్నట్లు రాధాకృష్ణ తెలిపారు. ఎంపికకు సహకరించిన బీఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి, సెలక్షన్ కమిటీ సభ్యుడు వంగ కుమారస్వామికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప మాలధారులకు మహాన్నదానం

కృష్ణకాలనీ, డిసెంబర్ 10 : జిల్లాకేంద్రంలోని శ్రీ చతురూప అయ్యప్ప సహస్ర లింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి-శోభ దంపతులు అయ్యప్ప మాలధారులకు మహాన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ దంపతులు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లట్ట రాజబాబు, ప్రధాన కార్యదర్శి రత్నం శివారెడ్డి , కోశాధికారి కోరె కుమార్, బీఆర్ఎస్ 27వ వార్డు అధ్యక్షుడు కవ్వంపెల్లి శేఖర్, నాయకులు కాటం రాజేశ్, కంచు రాజేందర్, ఆలయ కమిటీ సభ్యులు బండారి (సురభి) రమేశ్, బండ బాబు, వీరస్వామి, బోయిని వెంకటస్వామి పాల్గొన్నారు.

మావోయిస్టు పార్టీ సభ్యుడి లొంగుబాటు

వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి ఓఎస్డీ రవీందర్

ములుగు, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా కేంద్రంలో ఇన్‌చార్జి ఓఎస్డీ రవీందర్ ఎదుట మావోయిస్టు పార్టీ సభ్యుడు మంగళవారం లొంగిపోయాడు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సీపీఐ మావోయిస్టు వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీకి చెందిన సభ్యుడు లేఖం లచ్చు అలియాస్ అశోక్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పెద్దగెలూర్‌కు చెందిన వాడని తెలిపారు. ఎస్పీ శబరీష్ పర్యవేక్షణలో తన ఎదుట లొంగిపోయినట్లు చెప్పారు. లచ్చు 2022లో ఏటూరునాగారం-మహదేవపూర్ ఏరియా కమిటీకి చెందిన నల్లమరి అశోక్ అలియాస్ విజయేందర్ ప్రోద్బలంతో మావోయిస్టు పార్టీలో చేరి 2023 జనవరి వరకు మిలీషియా సభ్యుడిగా పనిచేసి జనవరి నుంచి వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ సెక్రటరీ అయిన ముచ్చకీ ఉంగల్ అలియాస్ సుధాకర్ ఆధ్వర్యంలో సుమారు రెండేళ్లపాటు పార్టీ సభ్యుడిగా పనిచేశాడని అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గుంజపర్తి గ్రామ సమీపంలో కర్రె గుట్టపై పోలీసులు మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నే సంతోశ్ అలియాస్ సాగర్, సెకండ్ సీఆర్‌సీ కంపెనీలో పనిచేసే సభ్యుడు మణిరామ్ లక్ష్మణ్ చనిపోగా లచ్చుతో పాటు మరికొంత మంది సభ్యులు పారిపోయారన్నారు. జూన్‌లో వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ సభ్యులతో కలిసి కర్రె గుట్టలపై అనేక చోట్ల ప్రెషర్‌మైన్స్ అమర్చిన ఘటనలో ఉన్నట్లు చెప్పారు. కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొని లచ్చు లొంగిపోయాడన్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు సైతం లొంగిపోవాలని ఇన్‌చార్జి ఓఎస్డీ విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఆర్ఐ సంతోశ్ ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఓఎస్డీ రవీందర్

సీఎం కప్ క్రీడలు ప్రారంభం

మహదేవపూర్/ కృష్ణకాలనీ/ చిట్యాల/ పలిమెల/ గణపురం/ మంగపేట/ మొగుళ్లపల్లి/ కాటారం, డిసెంబర్ 10 : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మంగళవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో,వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడారులను జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో రాణించిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మండలప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో వీరభద్రయ్య, అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పోటీలను ప్రారంభించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో భూపాలపల్లి, రేగొండ మండల కేంద్రాల్లోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల మైదానంలో రేగొండ మండల స్థాయి క్రీడలు నిర్వహించగా డీవైఎస్‌వో రఘు క్రీడలను ప్రారంభించారు. మండల స్థాయిలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో, యోగా, ఫుట్ బాల్ క్రీడల పోటీలు నిర్వహిస్తున్నామని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు.

కృష్ణకాలనీ : వాలీబాల్ క్రీడలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో రఘు

సమ్మెకు మద్దతుగా కూర్చున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

ములుగురూరల్, డిసెంబర్ 10 : ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం సమ్మె చేపట్టారు. జిల్లాలో గత 15రోజులుగా పాఠశాలల్లో, మండల కేంద్రాల్లో నల్ల బ్యాడ్జీలతో, వివిధ రూపాల్లో నిరసన తెలపడంతోపాటు ములుగులో నాలుగు రోజులుగా నిరసన తెలిపిన ఫలితం రాకపోవడంతో మంగళవారం సమ్మె బాట పట్టారు. ఈ మేరకు వారికి పీఆర్టీయు ములుగు జిల్లా అధ్యక్షువు వేం యాకూబ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోగల శ్రీరంగం, టీఆర్టీఫ్ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా రాజు, రిటైర్డ్ టీచర్ దేవులపల్లి సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జనగాం బాబురావు, తెలంగాణ పీఆర్టీయు జిల్లా అధ్యక్ష,ప్రదాన కార్యదర్శులు కొయ్యడ సురేందర్, పోరిక రామన్నలు సమ్మెకు మద్దతుగా దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘాల నాయకులు ముకుందరెడ్డి, కిశోర్‌బాబు, మల్లయ్య, చల్లా భాస్కర్‌రెడ్డి, కుమార్ పాడ్యా, జీవనప్రియ, ఫెరోజ్, విష్ణు, సుమ, సుజాత, రమేశ్, అనిల్, ప్రవీణ్, చరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సరైన చికిత్స అందించాలి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 10 : గర్భిణులకు సరైన చికిత్స అందించి సుఖ ప్రసవాలకు చర్యలు తీసుకోవాలని స్టేట్